అస్తవ్యస్తంగా డ్రైనేజీ



ఈ చిత్రంలో కనిపించేది మండలకేంద్రంలోని హైస్కూల్ ఆవరణలోని డ్రైనేజీ. డ్రైనేజీ శిథిలావస్థకు చేరుకోవడంతో మురుగునీరు నిలిచి రోడ్డుపైనే పారుతోంది. దీంతో దుర్వాసన రావడంతో పాటు రోగాలబారిన పడుతున్నామని కాలనీప్రజలు వాపోతున్నారు. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పట్టించుకోవడం లేదని, పలు వ్యాధులబారిన పడుతున్నామని వారు ఆరోపిస్తున్నారు.



ఈ చిత్రంలో కనిపించే డ్రైనేజీ మండలకేంద్రంలోని ఒకటో వార్డు రామకిష్టాపూర్ కాలనీలోనిది. గ్రామంలోని మురుగంతా ఈ డ్రైనేజీలో నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చుట్టుపక్కల ప్రజలు నిత్యం మురుగుతో ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఏళ్లుగా సమస్యను పరిష్కరించడం లేదని కాలనీ ప్రజలు వాపోతున్నారు.

- డ్రైనేజీల్లో నిలుస్తున్న మురుగు
- కంపు కొడుతున్న కాలనీలు
- రోగాలబారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

రుద్రంగి: మండలకేంద్రంలోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి కాలనీలన్నీ కంపు కొడుతున్నాయి. డ్రైనేజీల్లో చెత్తాచెదారం చేరి మురుగునీరంతా అలాగే నిల్వ ఉంటుంది. దుర్వాసన వెదజల్లడంతో పాటు దోమలు వృద్ధిచెంది పలు రోగాలబారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. పలుసార్లు సంబంధిత అధికారులకు సమస్యను విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి సమస్యను పరిష్కరించాలని పలు కాలనీల వాసులు కోరుతున్నారు.

దుర్వాసన వస్తోంది



డ్రైనేజీలో చెత్తా చెదారం చేరి మురుగునీరంతా నిల్వ ఉంటుంది. దీంతో దుర్వాసన వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులెవరూ పట్టించుకోవడం లేదు. దీంతో వ్యాధులబారిన పడుతున్నాం. డ్రైనేజీని శుభ్రం చేసి ఇబ్బందులు కలగకుండా చూడాలి. – దేశవేని వినోద్, మహాలక్ష్మి కాలనీ, రుద్రంగి

పట్టించుకోవడం లేదు



డ్రైనేజీ శిథిలావస్థకు చేరి మురుగునీరంతా రోడ్డుపై పారుతుండటంతో ఇబ్బందిగా ఉంది. దీంతో చుట్టుపక్కల పరిసరాలన్నీ కంపు కొడుతున్నాయి. పలుసార్లు విన్నవించాం. అయినా పట్టించుకునే నాథుడే లేడు. – మండలోజి సాయికుమార్, రుద్రంగి

ఇబ్బందులు లేకుండా చూస్తాం



పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. సమస్య ఉన్న చోట తక్షణమే చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. శిథిలావస్థకు చేరిన డ్రైనేజీలకు నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం. – రాందాస్, పంచాయతీ కార్యదర్శి, రుద్రంగి

నులి పురుగుల నివారణకు కృషి చేయాలి



ఎల్లారెడ్డిపేట: మాట్లాడుతున్న వైద్యాధికారి స్రవంతి



వీర్నపల్లి: మాట్లాడుతున్న వైద్యుడు

ఎల్లారెడ్డిపేట: నులిపురుగుల నివారణకు అందరూ కృషి చేయాలని మండల పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి కోరారు. పీహెచ్‌సీలో మంగళవారం ఉమ్మడి మండల వైద్యసిబ్బందితో నిర్వహించిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. మండలంలో 19 ఏళ్లలోపు వారు 16 వేల మంది ఉన్నారని, వారందరికీ మాత్రలు వేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకొని ఈనెల 27న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో మాత్రలు వేయాలని సూచించారు. వైద్యులు చిరంజీవి, పద్మ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో అంతర్జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భంగా శిక్షణ కార్యక్రమాన్ని వైద్యులు స్రవంతి, చిరంజీవి, పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 20న నిర్వహించే అంతర్జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో చిన్నారులకు మాత్రలు వేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులు, ఇతర ఆరోగ్య సమస్యలున్నవారికి ఈనెల 27న మాత్రలు వేయాలన్నారు. శిక్షణలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక, పీహెచ్‌సీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'హామీలు అమలు చేయాలి'

తంగళ్లపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని రాళ్లపేట గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థికసాయం, సామాజిక పింఛన్ నెలకు రూ.4 వేలు, మహిళలకు నెలకు రూ.2,500 అందిస్తామన్న హామీలు ఏమయ్యాయన్నారు. ప్రభుత్వం కొలువుదీరి ఆరునెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు సామాజిక భద్రత పథకం ద్వారా రూ.4 వేలు పింఛన్‌కు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఉపాధికూలీలకు రోజుకు రూ.300 కేంద్రం ప్రకటించినప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదని ఆరోపించారు. ఏడాదిలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని రోజుకూ రూ.600 కూలి చెల్లించాలని, కేరళ రాష్ట్రంలో మాదిరిగా పట్టణ ప్రాంతాల్లో సైతం ఉపాధిహామీ పనులు కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు పరశురాములు, శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవి, నర్సయ్య, సోమ పరుశురాములు, గౌరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిరాహార దీక్షకు తరలిన స్వర్ణకారులు

వేములవాడ: స్వర్ణకారులకు వృత్తి రీత్యా జరుగుతున్న దాడులను అరికట్టేందుకు హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద మంగళవారం నిర్వహించిన ఆమరణ నిరాహార దీక్షకు వేములవాడకు చెందిన స్వర్ణకారులు హైదరాబాద్ తరలివెళ్లారు. స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు గిన్నెలశ్రీనివాస్ తదితరులున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



పంపిణీ చేస్తున్న ఎంపీడీవో జయశీల

బోయినపల్లి: మండలంలోని గుండన్నపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే 60 మంది విద్యార్థులకు చంద్ర ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు సీ. రామరాజు ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా నోటు బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పులి లక్ష్మీపతి, మాజీ ఎంఈఓ చెన్నమాధవుని రామరాజు, కొప్పుల స్వామి, హెడ్ మాస్టర్ రాజశేఖర్, అమ్మ బడి చైర్మన్ నంది రాధ, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

ప్రమాదకర స్థలాల పరిశీలన



వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల వరుసగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వీటిపై ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు రూరల్ ఎస్సై మారుతి నాగాయపల్లి, పోచెట్టిపల్లి, మర్రిపల్లి గ్రామాలతో పాటు పలు ప్రాంతాలను పరిశీలించారు. వీటిపై జిల్లా ఎస్పీకి నివేదిక సమర్పించనున్నారు.

పెండింగ్ వేతనాలు ఇప్పించండి

గంభీరావుపేట: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇప్పించాలని గంభీరావుపేట మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు ఈవో అశోక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆరునెలలుగా తమకు వేతనాలు అందడం లేదని, కుటుంబ పోషణకు కష్టంగా ఉందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు అందించాలని పారిశుద్ధ్య కార్మికులు కోరారు.

సంక్షిప్త వార్తలు

సమస్యలను పట్టించుకోవాలి

సిరిసిల్లటౌన్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఇకనైనా నియోజకవర్గ ప్రజల సమస్యలను పట్టించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముశం రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సిరిసిల్లలో ఈఎస్ఐ ఆస్పత్రి, మెగా పవర్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని, పవర్ లూమ్ కార్మికుల ఉపాధికోసం కేంద్ర ప్రభుత్వ వస్త్రాలను సిరిసిల్లలో ఉత్పత్తి చేయించాలని కోరారు. బుధవారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ సిరిసిల్లలో పర్యటిస్తున్న సందర్భంగా హామీ ఇవ్వాలన్నారు. జిల్లా నాయకులు కోడం రమణ, ఎల్లా రెడ్డి, యెలిగేటి రాజశేఖర్, రమేశ్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు సీసీ కెమెరాలు ప్రారంభం

వేములవాడ: వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం ఎస్పీ అఖిల్ మహాజన్, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సీసీ కెమెరాలను ప్రారంభిస్తారని టౌన్ సీఐ వీరప్రసాద్ మంగళవారం తెలిపారు. నేరాలను అదుపునకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యదర్శిగా మల్లికార్జున్

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యదర్శిగా బూస మల్లికార్జున్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆవునూర్ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న మల్లికార్జున్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా మల్లికార్జున్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన పంచాయతీ కార్యదర్శి రాజు దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. మేజర్ పంచాయతీలో ఆరునెలలుగా అధికారులు, సిబ్బందిపై అవినీతి ఆరోపణల నేపథ్యంలో బిల్ కలెక్టర్ సెలవుపెట్టగా, పంచాయతీ కార్యదర్శి రాజు సైతం సెలవులో ఉన్నారు.

పరామర్శ


చందుర్తి : మండలంలోని మూడపల్లి గ్రామానికి చెందిన గోలి అరుందాస్ అనే పాస్టర్‌ను కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మంగళవారం పరామర్శించారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు రామస్వామి, నాయకులు నరసింహారెడ్డి తదితరులున్నారు.

వేములవాడరూరల్: వేములవాడ పరిధిలోని శాత్రాజుపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన గుడిసె పెద్ద భూమయ్య భౌతిక కాయానికి బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి నివాళి అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట గుడిసె పురుషోత్తం, మెట్ట దేవానంద్, గుడిసె సాగర్, గుడిసె మనోజ్, గుడిసె సదానందం, నల్ల సతీశ్‌రెడ్డి, బండ మహేందర్, గుడిసె అనిల్ తదితరులున్నారు.

49వ సారి రక్తదానం

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి చెందిన వంగ గిరిధర్‌రెడ్డి 49వ సారి రక్తదానం చేశాడు. మహారాష్ట్రలోని షిర్డీ పట్టణంలోని సాయిబాబా బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా సాయిబాబా దేవస్థానం తరఫున ప్రశంసాపత్రం అందించి, ప్రత్యేక దర్శన అవకాశం కల్పించారు. ఇటీవల రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతులమీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



గంభీరావుపేట: మండలంలోని నాగంపేట గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందనే ఫిర్యాదు మేరకు డీఎల్‌పీవో నరేశ్ మంగళవారం విచారణ చేపట్టారు. పాత ట్యాంకర్‌కు రంగులు వేసి, కొత్త ట్యాంకర్ కొనుగోలు చేసినట్లు బిల్లులు డ్రా చేశారని గ్రామంలో మొక్కలు నాటకున్నా నాటినట్లు బిల్లు తీసుకున్నారని, కంపోస్టు ఎరువుల డంపింగ్‌యార్డు పేరిట నిధులు వాడుకున్నారని ఎంపీటీసీ నాగభూషణం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో విచారణ చేపట్టారు. పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నాగభూషణం కోరారు. విచారణ నివేదికను జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు డీఎల్‌పీవో తెలిపారు.

'నీట్'పై సమగ్ర విచారణ జరపాలి

- బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు రవి గౌడ్



మాట్లాడుతున్న కంచర్ల రవి గౌడ్

తంగళ్లపల్లి: నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలకేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నీట్ పరీక్ష రాసిన లక్షలాది మంది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా ఇవ్వాలన్నారు. గుజరాత్‌లో నీట్ ప్రశ్నాపత్రాలు అమ్మినట్లు వస్తున్న ఆరోపణలపై ప్రధాని ఎందుకు స్పందించడం లేదన్నారు. నీట్ అక్రమాలతో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నీట్‌లో 67 మందికి మొదటి ర్యాంకు రావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. ఒకే కేంద్రనుంచి ఏడుగురు 720 మార్కులు సాధించడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, నవీన్, ఒగ్గు అరవింద్, రుద్రవేని సుజిత్, కోడం వెంకటేశ్, గౌరు రాకేశ్, సుర రంజిత్, భాను, నరేశ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు



మాట్లాడుతున్న సీసీఆర్ సంస్థ ప్రతినిధులు

వేములవాడ: రాజన్న ఆలయంలో జరుగుతున్న అవినీతిపై కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ వ్యవస్థాపకులు మంచికట్ల అనిల్‌కుమార్, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, వరంగల్ జోనల్ సెక్రెటరీలు సేవూరి రత్నాకర్, తాళ్లపల్లి నాగరాజు, ఈసంపల్లి సంతోష్ రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో పనిచేస్తున్న ఏఈవో గత పదేళ్లుగా బదిలీ లేకుండా విధులు నిర్వహిస్తున్నారనీ, తప్పుడు సర్టిఫికెట్స్‌తో ప్రమోషన్ పొంది ఏఈవోగా కొనసాగుతున్నారన్నారు. విజిలెన్స్ కేసు ఉన్నవారు కంటితుడుపు చర్యల అనంతరం యథావిధిగా కొనసాగిస్తున్నారన్నారు. ఆలయంలో పాలు, గోదాముల సరకులు, టెండర్ ప్రక్రియలకు సంబంధించిన అంశాలపై దేవస్థానంలో నిర్వహించడం లేదనీ, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కొన్నేళ్లుగా ఒకే ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇక్కడే తిష్టవేశారని, వీరందరిని మరో దేవస్థానానికి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ సభ్యులు కొక్కు గోపాలకృష్ణ, చౌటపల్లి వెంకటేశంలు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి




వినతిపత్రం అందజేస్తున్న స్వర్ణకారులు

ముస్తాబాద్: చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్న స్వర్ణకారుల కోసం స్వర్ణకారుల సంక్షేమ బోర్డును ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని స్వర్ణకారుల సంఘం మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య డిమాండ్ చేశారు. స్వర్ణకారులను ఆదుకోవాలని మంగళవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చింతోజు బాలయ్య మాట్లాడుతూ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.500 కోట్లు మంజూరు చేయాలన్నారు. అర్హులైన స్వర్ణకారులకు రూ.4వేల పింఛన్లు, డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు అందించాలని కోరారు. స్వర్ణకారులు అకాలమరణం చెందిన, ఆత్మహత్య చేసుకున్నా రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. కార్పొరేట్ జువెల్లర్స్‌తో స్వర్ణకారుల ఉపాధి దెబ్బతిందన్నారు. తుమ్మనపల్లి సతీశ్, చింతోజు శ్రీను, నారోజు రాజు, రఘు, వెంగళం శ్రీను, అనిల్, వెంకటేశ్, జగన్నాథం, సంతోష్, సత్యం, బ్రహ్మచారి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించినా మీటర్లు ఇస్తలేరు

- సెస్ అధికారుల తీరుపై బాధితుల ఆరోపణ



మీటర్ల కోసం కట్టిన రసీదులు

సిరిసిల్లటౌన్: సెస్ వినియోగదారులకు అందించే సేవల్లో పారదర్శకత లోపించిందన దానికి ఇదో నిదర్శనమని బాధితులు ఆరోపిస్తున్నారు. పట్టణంలోని సాయినగర్‌కు చెందిన సింగరవేణి పద్మ మే 26న మూడు విద్యుత్‌మీటర్ల కోసం డబ్బులు చెల్లించి రసీదులు పొందింది. మూడు రోజుల్లో ఇవ్వాల్సిన విద్యుత్ మీటర్ కనెక్షన్లు 21 రోజులు పూర్తయినా అధికారులు ఇవ్వడం లేదని మంగళవారం సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీటర్ రీడింగ్ నమోదు, సెస్ కార్యాలయ సేవల్లో అధికారుల నిర్లక్ష్యంపై చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

'ప్రైవేట్'లో పుస్తకాల విక్రయంపై ఆందోళన



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బ్యాగులు విక్ర యిస్తున్నారంటూ పీడీఎస్‌యూ నాయకులు మంగళవారం స్కూల్ ఎదుట ఆందోళన చేశారు. పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పుస్తకాలు విక్రయిస్తున్నారని, దీనిపై ఎంఈవోకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థి నాయకులు మల్లేశ్, తదితరులు ఉన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌కు చెందిన కీర్తి శ్రీకాంత్‌కు చెందిన సెల్‌ఫోన్‌ను ఏప్రిల్ 10న పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ ద్వారా ఫోన్‌ను గుర్తించి మంగళవారం బాధితుడికి అందజేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.



వర్షాలు కురవాలని 'కప్పతల్లి'

కోనరావుపేట: వర్షాలు కురవాలని మండలంలోని మామిడిపల్లిలో మంగళవారం కప్పతల్లి ఆట ఆడారు. విత్తనాలు విత్తుకొని వర్షాల కోసం రైతులు ఆశగా ఎదుచూస్తున్నారు. వానాకాలం మొదలైనా మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలు కురవడం లేదని, నాటిన విత్తనాలు మొలకెత్తడం లేదని తెలిపారు. వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలని ఈ సందర్భంగా వేడుకున్నట్లు రైతులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు



కేంద్ర మంత్రి సంజయ్‌తో బీజేపీ నాయకులు

ముస్తాబాద్: బీజేపీ మండల నాయకులు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌ను ఢిల్లీలో మంగళవారం కలిశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్‌కుమార్ పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మండల అభివృద్ధిపై కేంద్ర మంత్రితో చర్చించి, పలు వినతులు అందించామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు అంజాగౌడ్, వేణు, బాధ నరేశ్, క్రాంతి, వెంకన్న, రాజు తదితరులున్నారు.

బోయినపల్లి: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనుకటి హరీశ్ ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకరంగా కలిశారు. అనంతరం సంజయ్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.

పుష్పగుచ్ఛం అందజేత



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

సిరిసిల్లటౌన్: జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రెసిడెంట్ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూను జిల్లా రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రయకరావు వేణుకుమార్ మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కోశాధికారి తాటిపాముల శివ, ఈసీ కమిటీ సభ్యులు బుడిమే శివప్రసాద్, సంగీతం శ్రీనివాస్, గుడ్ల సునీల్ కుమార్ పాల్గొన్నారు.

బోయినపల్లి: సిరిసిల్ల జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందీప్‌కుమార్ ఝూను మండల తహసీల్దార్ డి. పుష్పలత మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు.

కూరగాయల మార్కెట్‌కు తాత్కాలిక ఏర్పాట్లు

వేములవాడ: వేములవాడ పట్టణంలోని రెండో బైపాస్‌రోడ్డులో కొనసాగుతున్న కూరగాయల మార్కెట్లో తాత్కాలిక ఏర్పాట్లు చేసేందుకు ప్రతిపాదనలు, ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ కోరినట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ మంగళవారం తెలిపారు. ప్రస్తుతం రోడ్డుపైనే కొనసాగుతుండటంతో రైతులకు ఇబ్బందుల దృష్ట్యా తాత్కాలిక ఏర్పాట్లు చేయాలని ఆ ప్రాంత రైతులు ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ కోరడంతో పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు చెప్పారు. అయితే రూ.2.50 కోట్లతో పోలీస్‌స్టేషన్ ముందు శామకుంటలో నిర్మించిన అధునాతన పద్ధతుల్లో ఉన్న కూరగాయాల మార్కెట్ వృథా కానుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

కతార్‌లో రుద్రంగి యువకుడి ప్రోగ్రాం



రుద్రంగి: తెలంగాణ గల్ఫ్ సమితి ఆధ్వర్యంలో దోహా కతార్‌లో రెండు రోజుల క్రితం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా రుద్రంగి యువకుడు దాసరి అరుణ్‌కుమార్‌తో ప్రోగ్రాం ఏర్పాటు చేయించి, పాటలు పాడించారు. అతను ఇదివరకు యాదగిరి చానల్, స్టార్ మా క్యాంపస్ రాక్‌స్టార్, స్టార్ మా, ఈటీవీ పాడుతా తీయగా, జెమిని టీవీ బోల్ బేబీ బోల్ ప్రోగ్రాంలలో, 15 సినిమాల్లో పాటలు పాడాడు. మారుమూల పల్లె నుంచి సింగర్‌గా ఎదిగి, ఊరికి పేరు తీసుకువస్తున్న అరుణ్‌కుమార్‌ను మండల ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

ఇద్దరిపై కేసు నమోదు

సిరిసిల్లక్రైం: ఎవరైనా బెదిరింపులకు పాల్పడి రౌడీయిజం చేస్తే కఠిన చర్యల తప్పవని సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి హెచ్చరించారు. డబ్బుల విషయంలో బెదిరింపులకు పాల్పడిన వారిపై మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన వైట్ల సాయికుమార్ సిరిసిల్లలోని ఓ పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి ఇల్లంతకుంట మండలం నర్సక్కపేటకు చెందిన సృజన్, దినేశ్ డబ్బుల విషయంలో సాయికుమార్‌ను బెదిరించారు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేయగా బెదిరించిన ఇద్దరిపై కేసు మంగళవారం నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చందుర్తి ఏఎస్సైగా బాపు

చందుర్తి : మండల ఏఎస్సైగా పి.బాపు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గంభీరావుపేట ఏఎస్సైగా పనిచేస్తున్న పి.బాపు బదిలీపై చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా విధుల్లో చేరారు.